క్లుప్తంగా

శాంతి భద్రతలపై చర్చ



ఏఎస్పీ ఖాదర్ బాషాను కలసిన డీఎస్పీ అంబికాప్రసాద్

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ఖాదర్ బాషాను అమలాపురం డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. వ్యక్తిగత కారణాలతో 15 రోజులుగా సెలవులో ఉన్న డీఎస్పీ అంబికాప్రసాద్ విధులకు తిరిగి హాజరైన తర్వాత ఏఎస్పీ బాషాను ఆయన చాంబర్‌లో కలసి కొద్దిసేపు పోలీసు సబ్ డివిజన్‌లో శాంతిభద్రతల గురించి మాట్లాడారు.

ముమ్మరంగా ఉపాధి పనులు



గొల్లవిల్లిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆ గ్రామంలోని కాశి చెరువులో ఉపాధి కూలీలు చేస్తున్న పూడికతీత పనులను సోమవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ పరిశీలించారు. ఈ చెరువులో పూడికతీత ద్వారా కూలీలకు 1900 పని దినాలను కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. పార్టీ నాయకుడు జొన్నాడ చిన్ని, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



కొమరగిరిపట్నంలో షిరిడీ సాయిబాబాను ఊరేగిస్తున్న భక్తులు

అల్లవరం: కొమరగిరిపట్నంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో 18వ వార్షికారాధన పూజలు సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. గ్రామంలో సాయిబాబాను ఊరేగించారు. భక్తులు అఖండ సాయినామ సంకీర్తన నిర్వహించి, స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, అలంకరణ, అర్చనలు, సాయి సత్యవ్రతాలు జరుగుతాయని నానిరాజు తెలిపారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తీర్థ ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.


ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులు



ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులను అందిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డులను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు సోమవారం పంపిణీ చేశారు. ఏపీఓ శ్రీనుబాబు ఆధ్వర్యంలో సోమవారం అల్లవరంలోని పనులు జరుగుతున్న ప్రదేశంలో 119 మంది ఉపాధి కూలీలకు గుర్తింపు కార్డులను అందించారు. మండలంలో 21 గ్రామాల్లో 1,800 కార్డులను ఇచ్చామని ఏపీఓ తెలిపారు. సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ సభ్యురాలు నిచ్చెనకోళ్ల మౌనిక, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, కొనుకు మహేష్, కార్యదర్శి రాజమోహన్, ఉప్పే సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'గుడ్‌సీడ్'కు పురస్కారం



మురళీమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కుంచే సునీత

ఉప్పలగుప్తం: ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఎఫ్టీపీసీ ఇండియా ఏర్పాటు చేసిన ఉత్సవాలలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు గుడ్‌సీడ్ ఫౌండేషన్‌కు సినిమా, టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పురస్కారం లభించింది. ఈ అవార్డును ప్రముఖ నిర్మాత, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్ చేతుల మీదుగా అందుకున్నట్లు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు కుంచే సునీత సోమవారం తెలిపారు. గుడ్‌సీడ్ అధినేత కుంచే రమణారావు, సునీత దంపతులను చల్లపల్లిలో పలువురు అభినందించారు.

సీబీఎస్‌ఈకి రెడీ..

- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
- సిలబస్ బోధనకు కానరాని సంసిద్ధత
- యానాంలో టీచర్లకు ప్రారంభం కాని శిక్షణ



యానాంలో మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర పాఠశాల

యానాం: పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం యానాంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సిలబస్‌ను అనుసరిస్తున్న యానాంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానాన్ని అమలు చేయాలని పుదుచ్చేరి విద్యాశాఖ నిర్ణయించింది. అయితే ఉపాధ్యాయులు సీబీఎస్‌ఈ సిలబస్ బోధనలో ఎంతవరకూ సంసిద్ధత కలిగి ఉన్నారని పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. పాఠ్య ప్రణాళికకు సంబంధించి శిక్షణా కార్యక్రమాన్ని ఇంకా ప్రారంభించకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. యానాంకు ప్రత్యేక విద్యా బోర్డు లేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ విద్యా బోర్డునే ఇన్నాళ్లు అనుసరిస్తూ వచ్చింది. 6 నుంచి 10వ తరగతి వరకూ ఏపీ స్టేట్ సిలబస్‌నే అమలు చేశారు. ఆ విధంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు సైతం ఆంధ్రప్రదేశ్ ఎస్ఎస్‌సీ ద్వారానే జరిగేవి. మొత్తం పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం 4 రీజియన్‌లలో యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి ఉన్నాయి. వీటికి ప్రత్యేక బోర్డులు లేకపోవడంతో యానాం ఏపీ బోర్డును, మాహే కేరళ బోర్డును, కారైకల్, పుదుచ్చేరి తమిళనాడు విద్యా బోర్డులను అనుసరిస్తూ వస్తున్నాయి. 2015–16 నుంచి 1 నుంచి 5వ తరగతి వరకూ యానాంలో సీబీఎస్‌ఈ సిలబస్ అమలు జరుగుతుంది. ప్రస్తుతం ఉన్నత తరగతులైన 6 నుంచి 9వ తరగతులకు, ఇంటర్ ప్రథమ సంవత్సరం తరగతుల్లో సీబీఎస్‌ఈ కరిక్యులమ్‌ను అమలు చేయనున్నారు.

మొదలు కాని శిక్షణ

నూతనంగా ఉన్నత తరగతుల్లో సీబీఎస్‌ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో సీబీఎస్‌ఈ విద్యా ప్రణాళికపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. అయితే గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. 6 నుంచి 11 వరకు బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం కాలేదు. జూన్ 14 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. ఉన్నత తరగతులకు సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా తరగతులు బోధించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో యానాంలో 74 మంది టీజీటీలకు సీబీఎస్‌ఈపై శిక్షణ తరగతులు నిర్వహించాల్సి ఉంది. ఈ తరగతులు యానాంలోనే నిర్వహించాలని పలువురు టీచర్లు కోరుతున్నారు. యానాంలో సీబీఎస్‌ఈ అమలు చేయనున్న నేపథ్యంలో విద్యాశాఖ ఇప్పటికే పాఠశాలలకు సీబీఎస్‌ఈ గుర్తింపునకు సంబంధిత సంస్థకు వివిధ ఫైర్ అండ్ బిల్డింగ్ సేఫ్టీ డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంది. ప్రతి విద్యా సంవత్సరం సీబీఎస్‌ఈ అఫిలియేషన్ పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే యానాంలోని 8 ప్రభుత్వ హైస్కూల్స్‌కు సంబంధించి ఫార్మెట్ ప్రకారం దరఖాస్తు చేశారు. ఎన్‌సీఈఆర్‌టీ బెంగళూరు నుంచి పాఠ్య పుస్తకాలు రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

> **అందరూ సిద్ధం కావాలి**
>
> 
>
> యానాంలో 2023–24 విద్యా సంవత్సరం నుంచి నూతన విద్యా విధానం అమలు కానుంది. ఆరో తరగతి నుంచి 9 వరకూ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీబీఎస్‌ఈ అమలవుతుంది. టీచర్లకు శిక్షణ తరగతులు యానాంలోనే నిర్వహించే విధంగా అధికారులు ఆలోచిస్తున్నారు. స్కూల్స్ తెరిచే నాటికి బోధనకు సిద్ధమవుతారని భావిస్తున్నాం. సీబీఎస్‌ఈ పాఠ్య పుస్తకాలు సైతం వస్తున్నాయి.
>
> – పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, విద్యాశాఖాధికారి, యానాం

ఉత్సాహంగా మ్యాజిక్ షో



తాళ్లరేవులో వేసవి శిక్షణలో కాగితపు బొమ్మలతో చిన్నారులు

తాళ్లరేవు: స్థానిక ప్రజా సంఘాల భవనంలో వారం రోజులుగా వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం జేవీవీ సభ్యుడు శ్రీరామ్ నిర్వహించిన మ్యాజిక్ షో ఆకట్టుకుంది. కాగితాలతో కళాకృతుల తయారీ తదితర అంశాలను నేర్పించారు. అనంతరం శ్రీరామ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, అత్తిలి బాబూరావు, ఉంగరాల వెంకటేశ్వరరావు, తణుకు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో..

ముమ్మిడివరం: స్థానిక రవీంద్ర ప్రైమరీ స్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోద కేంద్రంలో విద్యార్థులకు సోమవారం ఆటలు, పాటలు, సైన్స్ మ్యాజిక్ నేర్పించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ, జిల్లా కోకన్వీనర్ ఎన్.అబ్బులు, బి.బాబూరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.రాము, జిల్లా అకడమిక్ కన్వీనర్ ఎన్.అబ్బులు, పి.మురుగేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తులు

తాళ్లరేవు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారి వి.మాధవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తాళ్లరేవు మండలం నీలపల్లి రామచంద్రకాలనీ అంగన్‌వాడీ సహాయకురాలు (ఓసీ జనరల్)కు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రేపటి నుంచి వైద్య శిబిరాలు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలను ఈ నెల 31 నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను వ్యక్తిగతంగా ఏర్పాటు చేస్తున్న ఈ శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షలు చేసి కళ్లజోళ్లు, మందులు సైతం ఉచితంగా ఇస్తామన్నారు. 31న గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్, జూన్ 2న దరియాలతిప్ప కేఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్, 4న బెజవాడ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద, 6న కనకాలపేట కేపీవీఎస్ ప్రభుత్వ హైస్కూల్‌లో మెగా కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇనోదయ ఆసుపత్రి, లయన్స్ క్లబ్ పిల్లారాయ, యానాం తదితరులు సైతం ఈ శిబిరంలో సహాయ సహకారాలు అందిస్తారన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పరాభవం తప్పదు



కార్యకర్తలతో పాటు బైక్ ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ర్యాలీ
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన



మోటార్ సైకిళ్ల ర్యాలీలో మంత్రి తనయుడు శ్రీకాంత్ తదితరులు

అమలాపురం రూరల్: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటే, ఆ స్థలాలు సమాధులు కట్టుకోవడానికి కూడా సరిపోవంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా అమలాపురంలో సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. భట్నవిల్లిలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం నుంచి మంత్రి తనయుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అమలాపురం ఎర్రవంతెన, వేంకటేశ్వరస్వామి ఆలయం, గడియార స్తంభం కూడలి, ఈదరపల్లి వంతెన, ముమ్మిడివరం గేటు, హైస్కూల్ సెంటర్ వరకూ సాగింది. హైస్కూల్ సెంటర్లో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, శ్రీకాంత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి ప్రాంతంలో 51 వేల మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, ఓర్వలేని చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నిరుపేదలకు ఇచ్చే స్థలాలను సమాధులుగా పోల్చడం చంద్రబాబు అజ్ఞానానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పరాభవం తప్పదన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు సంసాని నాని, బొంతు గోవిందుశెట్టి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేశారు. ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు బద్రి బాబ్జి, కొనుకు బాపూజీ, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి, కొనుకు గౌతమి, గెద్దం సంపదరావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైస్ ఎంపీపీ పొలమూరి బాలకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, పార్టీ తుని నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, నాయకులు సుధాగణపతి, సరెళ్ల రామకృష్ణ, షేక్ అబ్దుల్‌ఖాదర్, కాలెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మృతికి చంద్రబాబే కారణం



కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ మానవతావాదని, అటువంటి వ్యక్తి చనిపోవడానికి కారకుడైన చంద్రబాబు ఎన్టీఆర్ శత జయంతిని చేయడం విడ్డూరంగా ఉందని ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ అన్నారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ మహానాడులో చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మహానాడులో ఇచ్చిన హామీలన్నీ ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో చెప్పుకోదగ్గ పథకాలు ఏమీ అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ పథకాలను కాపీ కొట్టి కొత్త పేర్లతో మ్యానిఫెస్టో విడుదల చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో ఇవ్వని నిరుద్యోగ భృతిని ఇప్పుడు ఎలా ఇస్తావని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి 2024 ఎన్నికల్లో సీఎం జగన్‌కే పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.


పేదలను పట్టించుకోని చంద్రబాబు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పనిచేసిన చంద్రబాబు అప్పట్లో పేదలను పట్టించుకోలేదని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానికంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రజలను మోసం చేయడానికి మరోసారి ప్రయత్నిస్తున్నారన్నారు. టీడీపీ నిర్వహించింది మహానాడు కాదని, మాయల నాడు అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే, వాటిని సమాధులతో చంద్రబాబు పోల్చడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం భక్తుల నుంచి విరాళాలు అందినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన కె.శ్రీనివాసులు–ఉషారాణి దంపతులు రూ.11,116, పెనుమంట్రకు చెందిన కె.శ్రీనివాసరెడ్డి–నాగ స్వప్న దంపతులు రూ.10,001, ఊబలంకకు చెందిన కె. శ్రీనివాసరెడ్డి–నాగమణి దంపతులు రూ.10,116, రావులపాలెంకు చెందిన ఎస్.శంకర్‌కుమార్‌రెడ్డి–విజయలక్ష్మి దంపతులు రూ.18 వేలు, పెద్దలంకకు చెందిన టి.వెంకట శివరావు రూ.10,116 విరాళాలు అందించినట్లు తెలిపారు. దాతలకు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

టేకు సింహాసనం సమర్పణ



టేకు సింహాసనం సమర్పించిన వెంకన్నచౌదరి దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కాకినాడ జిల్లా వేళంగికి చెందిన మెర్ల వెంకన్నచౌదరి–మణికుమారి దంపతులు సోమవారం రూ.1.60 లక్షల విలువైన టేకు సింహాసనాన్ని సమర్పించారు. ఈ సింహాసనాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టీలు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబుకు అందజేశారు. సింహాసనానికి ప్రత్యేక పూజలతో సంప్రోక్షణ చేసిన అనంతరం దానిపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అధిష్ఠింపచేసి ఆలయ అర్చకులు దాతలతో ప్రత్యేక పూజలు చేయించారు.

సేవా వారధులు వలంటీర్లు

- పథకాల అమలులో వారిదే కీలకపాత్ర
- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్



వలంటీర్ అప్పలరాజుకు సేవా వజ్ర అవార్డు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: సేవా వారధులు వలంటీర్లు అని, పథకాల అమలులో వారే కీలకమని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సూర్యభాస్కర కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివన్నారు. నాలుగేళ్లలో సుమారు రూ.2.25 లక్షల కోట్ల లబ్ధిని వలంటీర్ల ద్వారా ప్రజలకు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా తుపానులు, వరదలు, కోవిడ్ సమయంలో వలంటీర్లు చేసిన సేవలు మరపురానివన్నారు. వీరిని ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఏటా పురస్కారాలు అందిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు మేలు కలగడంతో పాటు ఎంతోమందికి ఉపాధి లభించిందన్నారు. టీడీపీ మహానాడులో చంద్రబాబు ఇచ్చిన హామీలు నీటిమీద రాతల్లా ఉన్నాయన్నారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేయని వ్యక్తి రైతులకు ఏడాదికి ఏవిధంగా రూ.15 వేలు ఇస్తారని ప్రశ్నించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు చెప్పుకొనేందుకు ఒక్క పథకం కూడా లేదన్నారు. చంద్రబాబును ఔట్‌డేటెడ్ లీడర్‌గా పొన్నాడ అభివర్ణించారు. అనంతరం ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హుల ఇంటికే పథకాలు చేరుతున్నాయన్నారు. దీనివల్ల పేదల ఇంట సంక్షేమ వెలుగులు వచ్చాయని అన్నారు. అనంతరం సేవా వజ్ర అవార్డులకు ఎంపికైన దాయం అప్పలరాజు (చొల్లంగిపేట), దొంగ శివన్నారాయణ (పి.మల్లవరం)లతో పాటు మరో ఐదుగురిని సేవారత్న పురస్కారాలతో పాటు సుమారు 400 మంది వలంటీర్లను దుశ్శాలువాతో సత్కరించారు. జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి, సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, విశ్రాంత జేడీ పెట్ల సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వార్డు సచివాలయాల పర్యావరణ కార్యదర్శులు

అమలాపురం టౌన్: స్థానిక 5, 6 వార్డుల పరిధిలోని సూర్యనారాయణపేట, వీఎం రంగానగర్, మొబర్లీపేటల్లో పర్యావరణ పరిరక్షణపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ హిత జీవన శైలి కోసం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు సచివాలయాల పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కల్వకొలను వీధి వార్డు సచివాలయ పర్యావరణ కార్యదర్శి బండి వీరన్న తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు బదులు వస్త్ర, నార, పేపర్ సంచులను వినియోగించాలని అన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించుకోవాలని సూచించారు. ఇళ్లలో తడి, పొడి చెత్తలను వర్గీకరించి తడి చెత్తను హోం కంపోస్టు చేసి ఇంటి ప్రాంగణంలోని మొక్కలకు సేంద్రియ ఎరువుగా వేయాలని తెలిపారు. చివరగా పర్యావరణ పరిరక్షణకు కంకణబద్ధులై కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని పలు వార్డు సచివాలయాల పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు ఎం.సత్య అనంతలక్ష్మి, చింతా నాగేంద్రప్రసాద్, వంకాయల సతీష్, ఎం.భార్గవి పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్లు



గొల్లవిల్లి స్టాక్ పాయింట్ వద్ద జేవీకే కిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

ఉప్పలగుప్తం: ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లను ప్రతి పాఠశాలకు జూన్ 10లోగా చేర్చాలని విద్యాశాఖ అకడమిక్ మోనిటరింగ్ అధికారి (ఏఎంఓ) పి.రాంబాబు తెలిపారు. గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణతో కలసి సోమవారం పరిశీలించారు. ఏఎంఓ రాంబాబు మాట్లాడుతూ జూన్ 12న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్న జగనన్న విద్యా కానుక కార్యక్రమం అనంతరం పాఠశాలల్లో ప్రతి విద్యార్థి చేతిలో కిట్లు ఉండాలని ఆదేశించారు. మండలంలో 5,061 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఐదేళ్లు నిండి బడికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్న పిల్లలు మండలంలో 447 మంది ఉండగా 49 మందికి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. దీనిద్వారా ఇప్పటికే 37 మంది స్థానాలను భర్తీ చేసుకోగా 12 మందికి అవకాశం ఉండటంతో వారు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా సిబ్బంది పని చేయాలని తెలిపారు. ఎంఈఓ కె.కిరణ్‌బాబు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగులకు మనోధైర్యం కల్పించాలి



మొసలపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో భారతలక్ష్మి

అంబాజీపేట: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు మనోధైర్యం కల్పించాలని అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌వో సీహెచ్‌వీ భారతలక్ష్మి వైద్య సిబ్బందికి సూచించారు. మొసలపల్లిలో పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను, పెదగరువులో అంగన్‌వాడీ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని గ్రామాల్లో రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీబీ, లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించడంతో పాటు మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం డయాబెటిక్ రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అంతకుముందు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డి.శిరీష, హెచ్‌వీ శాంతకుమారి, వైద్య సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు, చంద్రకళ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



ఆర్‌ఏఓ మునిస్వామిని సత్కరిస్తున్న నూతన ఈఈ వీరసెల్వం

యానాం: నియోజకవర్గ పరిధిలో పీడబ్ల్యూడీ శాఖాపరంగా చేపట్టే వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేయాలని ఆర్‌ఏఓ మునిస్వామి కోరారు. సోమవారం యానాం పీడబ్ల్యూడీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా కొత్తగా నియమితులైన కె.వీరసెల్వంతో వివిధ అంశాలపై చర్చించారు. పూర్తి స్థాయిలో ఈఈ లేకపోవడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన రోడ్లు, డ్రైన్లు తదితర పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అంతకు ముందు ఆర్‌ఏఓ మునిస్వామిని ఈఈ వీరసెల్వం దుశ్శాలువాతో సత్కరించారు.

బ్రిడ్జి పనులకు టెండర్లపై హర్షం

అమలాపురం టౌన్: కోనసీమ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా గౌతమీ రైల్వే బ్రిడ్జికి సంబంధించి ఇప్పటికే పూర్తయిన పిల్లర్లపై వంతెన, ట్రాక్, మౌలిక వసతులకు రూ.296.51 కోట్లతో టెండర్లు పిలవడంపై కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్‌ఎస్ఎస్) హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు రైల్వే నోటిఫికేషన్ జారీ చేయడంతో నిర్మాణ పనులు మరింత వేగవంతం కానున్నాయని కేఆర్‌ఎస్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అమలాపురం వరకూ స్థల సేకరణ పూర్తి కావడంతో ట్రాక్ నిర్మాణం చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేఆర్‌ఎస్ఎస్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధి, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, కమిటీ సభ్యులు ఉప్పుగంటి భాస్కరరావు, సప్పా నాగేశ్వరరావు, బీఎస్ మూర్తి, వంకాయల రాజీ, ఆర్వీ నాయుడు, ఎరగర్త వెంకటేశ్వరరావు, పోలిశెట్టి శివాజీ తదితరులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

బాపనయ్యనాయుడికి నివాళి

యానాం: ఫ్రెంచ్ కాలంలో యానాం పట్టణ మేయర్‌గా వ్యవహరించిన బెజవాడ చినబాపనయ్యనాయుడి వర్ధంతిని సోమవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ వద్ద బాపనయ్యనాయుడి విగ్రహానికి ఆర్‌ఏఓ మునిస్వామి, సీఐ షణ్ముగం, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పూలమాలలు వేశారు. బాపనయ్య నాయుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రావులమ్మ తీర్థం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో రావులమ్మ అమ్మవారి తీర్థాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు పది రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను వివిధ సామాజిక వర్గాల వారు ఘనంగా సేవలు చేశారు. సోమవారం రాత్రి జరిగిన జాతరలో గరగ నృత్యాలతో పాటు కోయ డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి.